ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలి

రామ్‌దేవ్‌రావ్ ఆస్పత్రి ఎండీ డా.కమలాకర్



బ్లడ్ దోనర్స్ డే సందర్భంగా కేక్ కట్ చేస్తున్న ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది

కూకట్‌పల్లి: రామ్‌దేవ్‌రావ్ ఆస్పత్రి, వీకేఆర్ బ్లడ్ సెంటర్ సంయుక్తంగా వరల్డ్ బ్లడ్ డోనర్ డేని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి ఎండీ డా. కె.కమలాకర్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని కోరారు. వీకేఆర్ బ్లడ్ సెంటర్ డైరెక్టర్ డా. సుమన మాట్లాడుతూ.. అన్ని దానాల కన్న రక్తదానం చాలా గొప్పదన్నారు. ఎందుకంటే రక్తదానం చేస్తే ఎక్కడో ఒక చోట రోగికి అది ఉపయోగపడి అతడి ప్రాణాలను నిలబెడుతుందన్నారు. సంపత్ అనే వ్యక్తి 300 సార్లు రక్తదానం చేశారు. అదే విధంగా శ్రీనివాస్ గొగరాజు 249 సార్లు, మహేందర్‌రెడ్డి 99 సార్లు రక్తదానం చేసి ఆదర్శంగా నిలుస్తున్నారు. ఈ సందర్భంగా వారి సేవలను గుర్తించి ఆస్పత్రి నిర్వాహకులు వారిని సన్మానించారు. అదేవిధంగా స్వచ్ఛందంగా రక్తదానం చేసిన 10 మందిని సన్మానించుకున్నారు.

ఓయూ కాంట్రాక్టు ఉద్యోగులను ఆదుకోవాలి

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ కాంట్రాక్టు ఉద్యోగులను ప్రభుత్వం ఆదు కోవాలని కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ ధర్మతేజ శుక్రవారం ఓ ప్రకటనలో కోరారు. ఓయూ కంటే చిన్న యూనివర్సిటీలైన కాకతీయ, మహాత్మగాంధీ వర్సిటీల్లో కాంట్రాక్టు అధ్యాపకులు ఉద్యోగ విరమణ చేసినా, మరణించినా రూ.5 లక్షలు చెల్లిస్తున్నారని పేర్కొన్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం యూజీసీ నిబంధనలను బూచిగా చూపి వర్సిటీ కాంట్రాక్టు ఉద్యోగాలను పర్మినెంట్ చేయాలేదని, ప్రసుత సీఎం రేవంత్‌రెడ్డి యూజీసీ నిబంధనల ప్రకారం వర్సిటీ ఉద్యోగుల విరమణ వయస్సును 65 ఏండ్లకు పెంచాలని కోరారు.

కాంట్రాక్టు ఉద్యోగులను కొనసాగించాలి

ఓయూలో పని చేసి ఉద్యోగ విరమణ చేసే అధ్యాపకులు, ఉద్యోగులను విధుల్లో కొనసాగించాలని ఉద్యోగ సంఘాల నాయకులు అధికారులను కోరారు. యూజీసీ నిబంధనల ప్రకారం కాంట్రాక్టు ఉద్యోగులకు విరమణ వయస్సు లేదని, ఆరోగ్యంగా ఉన్నంత కాలం సేవలను ఉపయోగించుకోవచ్చని అని పేర్కొన్నారు. అధ్యాపకుల కొరత తీవ్రంగా ఉన్న ఓయూలో కాంట్రాక్టు అధ్యాపకులను కొనసాగించాలని డాక్టర్. ధర్మతేజ కోరారు. అలాగే కాంట్రాక్టు ఉద్యోగుల వేతనాలు పెంచాలని, పీఆర్‌సీ అమలు చేయాలని ఉద్యోగ సంఘం నేతలు ప్రభుత్వానికి విన్నవించారు.

కూకట్‌పల్లి పోలీసుల స్పెషల్ డ్రైవ్

మూసాపేట: కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని భాగ్యనగర్‌కాలనీ బస్‌స్టాప్, కేపీహెచ్‌బీ మెట్రో స్టేషన్ పరిసరా ప్రాంతాల్లో ఇన్‌స్పెక్టర్ కృష్ణమోహన్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. రద్దీగా ఉండే ప్రాంతాల్లో పోకిరీల ఆగడాలు, కళాశాలలు ప్రారంభం కావడంతో బస్‌స్టాప్‌లో అల్లరి చేసే ఆకతాయిలను అరికట్టేందుకు ఈ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. అదే విధంగా పలు లాడ్జీలను పరిశీలించి రిజిస్టర్లను తనిఖీ చేశారు. లాడ్జీ నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నట్లు తెలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



భాగ్యనగర్‌కాలనీలోని లాడ్జిలో తనిఖీలు చేస్తున్న కూకట్‌పల్లి పోలీసులు

‘ఐఎస్ఐ’ ఫలితాల్లో గురుకుల విద్యార్థి ప్రతిభ

ఆలిండియా ర్యాంకు 137 ..హైదరాబాద్ రీజియన్‌లో మొదటి ర్యాంకు



రాయదుర్గం: ఇండియన్ స్టాటిస్టికల్ ఇన్‌స్టిట్యూట్(ఐఎస్ఐ) ప్రకటించిన ఫలితాలలో గౌలిదొడ్డిలోని సాంఘిక సంక్షేమ గురుకుల విద్యార్థి ప్రతిభ చాటాడు. కళాశాలకు చెందిన విద్యార్థి జాడీ రేవంత్ ఆలిండియా ర్యాంకు 137, కేటగిరి ర్యాంకు 4, హైదరాబాద్ రీజియన్‌లో మొదటి ర్యాంకును సాధించడం విశేషం శుక్రవారం తెలంగాణ రాష్ట్ర సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల ప్రిన్సిపల్ డి గణేష్ మాట్లాడుతూ ఐఎస్ఐ ప్రకటించిన ఫలితాలలో తమ విద్యార్థి రేవంత్ అత్యంత ప్రతిభ చాటారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థి రేవంత్‌ను, ప్రిన్సిపల్ గణేష్, అధ్యాపక బృందాన్ని గురుకుల కళాశాలల కార్యదర్శి సీతాలక్ష్మి, హెచ్‌ఆర్‌ఆర్ వెస్ట్ ఆర్‌సీఓ డాక్టర్ శారదా వెంకటేష్, అదనపు కార్యదర్శి సక్రునాయక్ అభినందించారు.

ఉత్తమ విద్యార్థులుగా ఉపాధ్యాయులు తీర్చిదిద్దాలి

కొండాపూర్ కార్పొరేటర్ హమీద్ పటేల్

రాయదుర్గం: ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులదే అని కొండాపూర్ కార్పొరేటర్ హమీద్‌పటేల్ పేర్కొన్నారు. కొండాపూర్ డివిజన్‌లోని కొత్తగూడ ఎంపీపీఎస్ ప్రభుత్వ పాఠశాలలో బడిబాట కార్యక్రమంలో పాల్గొని చిన్నారులకు పలక, బలపం, పెన్సిళ్ళు, పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ వెంకటయ్య, హెచ్‌ఎం నాగయ్య, మారి టెక్ ఫౌండేషన్ నిర్వాహకులు స్వర్ణరెడ్డి, సీనియర్ నాయకులు జంగంగౌడ్, లక్ష్మీనారాయణ, కేశంకుమార్, లక్ష్మణ్,ఖాసీమ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో ఫీజుల నియంత్రణ చట్టం తేవాలి

సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు రాజయ్య

పటాన్‌చెరు టౌన్: విద్యాహక్కు చట్టం ప్రకారం 25% సీట్లను ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ఉచితంగా ఇవ్వాలని, రాష్ట్రంలో ఫీజుల నియంత్రణ చట్టం తేవాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు రాజయ్య అన్నారు.శుక్రవారం సీపీఐ (ఎం) పటాన్‌చెరు ఏరియా కమిటీ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ప్రైవేట్ విద్యాసంస్థలలో అధిక ఫీజులను, డొనేషన్‌లను అరికట్టాలని, అధిక ఫీజులు వసూలు చేసే వారిపైన క్రిమినల్ కేసు నమోదు చేయాలని, విద్యా హక్కు చట్టాన్ని అమలు చేయాలని, పేరెంట్స్ కమిటీలను నియమించాలని, సుప్రీం కోర్టు గైడ్ లెన్స్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం ఏరియా కమిటీ సభ్యులు పాండురంగారెడ్డి, నాగేశ్వరరావు, సీపీఎం, సీఐటియూ నాయకులు శాంతకుమార్, శ్రీధర్, లకాన్, చక్రధర్ సింగ్, ఎంజీవీఎస్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రక్తదానంపై ప్రజల్లో అవగాహన కల్పించాలి



కిమ్స్ హాస్పిటల్‌లో రక్తదాన శిబిరంలో వైద్యులు

కిమ్స్ సీఎండీ భాస్కర్‌రావు

సనత్‌నగర్: రక్తదానంపై ప్రజల్లో అవగాహన పెంచాల్సిన అవసరం ఉందని కిమ్స్ హాస్పిటల్స్ గ్రూప్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ బొల్లినేని భాస్కర్‌రావు అన్నారు. అంతర్జాతీయ రక్తదాన దినోత్సవాన్ని పురస్కరించుకుని సికింద్రాబాద్ కిమ్స్ ఆసుపత్రిలో శుక్రవారం రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల సరిపడా రక్తం అందుబాటులో లేకపోవడంతో రోగులు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. కిమ్స్ హాస్పిటల్‌లోని గణాంకాలను పరిశీలిస్తే 30 నుంచి 50 ఏళ్ల వారు అధికంగా రక్తదానం చేస్తున్నారని, కానీ 18 నుంచి 30 ఏళ్ల వరకు ఉన్న యువత కూడా రక్తదానం చేసేందుకు ముందుకురావాలని సూచించారు. బ్లడ్‌బ్యాంక్ విభాగాధిపతి డాక్టర్ కీర్తి మాట్లాడుతూ చాలామంది యువతకు రక్తదానంపై సరైన అవగాహన ఉండడం లేదని ఇందుకోసం కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. అనంతరం రక్తదానం చేసిన వారికి జ్ఞాపికలు అందజేశారు.

డీఎంహెచ్‌వో కార్యాలయంలో రక్తదానం శిబిరం

సనత్‌నగర్: ప్రపంచ రక్తదాన దినోత్సవం సందర్భంగా సికింద్రాబాద్‌లోని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయంలో శుక్రవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటి శిబిరాన్ని ప్రారంభించి రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు స్వచ్ఛందగా రక్తదానం చేసి రోగుల ప్రాణాలు కాపాడాలని కోరారు. అనంతరం మలేరియా విభాగం అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ అమర్‌సింగ్ శిబిరాన్ని సందర్శించి రక్తదాతలను అభినందించారు. కాగా జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయ అధికారులు, సిబ్బంది, జిల్లా లెప్రసీ విభాగం వైద్యులు, సిబ్బంది, మలేరియా సిబ్బంది, పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు, సిబ్బంది దాదాపు 51 మంది రక్తదానం చేశారు.



జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో జరిగిన రక్తదాన శిబిరంలో అధికారులు

‘మీ సేవ’ మా ఇష్టం..



ప్రభుత్వం నిర్ణయించిన ధర కంటే అధికంగా వసూలు

- బినామీ పేర్లతో పలుచోట్ల దందా
- అన్ని ధ్రువపత్రాలకు మీ సేవ కేంద్రమే దిక్కు
- అధికారులు స్పందించాలంటున్న ప్రజలు

సాక్షి, మేడ్చల్: ప్రజలకు సత్వర సేవలు అందించేందుకు ఏర్పాటు చేసిన మీ సేవ కేంద్రాల్లో నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. నగరంతో సహా శివారు రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాలోని పలు మీ సేవ కేంద్రాల్లో ధ్రువపత్రాల కోసం డబ్బులు అధికంగా వసూలు చేస్తున్నారు. ప్రభుత్వం నిర్ణయించిన రుసుం కంటే అధిక వసూళ్లు చేస్తున్నా పట్టించుకునే వారే కరువయ్యారు. మీ సేవ కేంద్రాలను పర్యవేక్షించాల్సిన సంబంధిత అధికారులు నిర్వాహకులతో కుమ్మక్కవుతున్నారనే ఆరోపణలు లేకపోలేదు. ధ్రువపత్రాల కోసం మీరు ఏ కార్యాలయానికి తిరగాల్సిన అవసరం లేదని, తమకు అడిగినంత ఇస్తే.. వాటిని తెచ్చిస్తామని మీ సేవ కేంద్రం నిర్వాహకులు ప్రజల నుంచి ముక్కుపిండి వసూలు చేస్తున్నారు.

పలుచోట్ల దందా..

జనన, మరణ ధ్రువీకరణ పత్రాలకు దరఖాస్తు చేస్తే రూ.90 తీసుకోవాలి. కానీ కేంద్రాల నిర్వాహకులు రూ.120 నుంచి రూ.150 వరకు వసూలు చేస్తున్నారు. కులం, ఆదాయం, నివాస ధ్రువపత్రాలకు దరఖాస్తు కోసం రూ.45 తీసుకోవాల్సి ఉండగా, రూ.70 నుంచి రూ.100 వరకు తీసుకుంటున్నారు. శివారుల్లోని పలుచోట్ల రూ.60 వరకు వసూలు చేస్తున్నారు. చాలా వరకు మీ సేవ కేంద్రాల్లో ఇదే దందా కొనసాగుతోంది.

ప్రజలకు ఇబ్బందులు లేకుండా..

ప్రజలకు ఇబ్బందులు లేకుండా సేవలు అందించడంతో పాటు యువతకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం మీ సేవ కేంద్రాలను ఏర్పాటు చేసింది. నగరంతో సహా శివారు రంగారెడ్డి, మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో మొత్తంగా 1,327 మీ సేవ కేంద్రాలు ఉండగా, ఇందులో ఒక్క మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోనే 306 మీ సేవ కేంద్రాలు ఉన్నట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. ప్రభుత్వం ఏ పథకం చేపట్టినా మీ సేవ కేంద్రాల ద్వారానే దరఖాస్తు చేసుకోవాలని సూచిస్తోంది. ప్రజల అవసరాలను ఆసరా చేసుకొని చాలాచోట్ల అధిక రుసుం వసూలు చేస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయి. వాటిపై ‘తహసీల్దారు కనీస పర్యవేక్షణ చేయడం లేదు. ప్రస్తుతం విద్యా సంవత్సరం ప్రారంభమైన నేపథ్యంలో ఉన్నత చదువుల కోసం విద్యార్థులు కులం, ఆదాయం, నివాస ధ్రువీకరణ పత్రాల కోసం మీ సేవ కేంద్రాల చుట్టూ తిరుగుతున్నారు. ఇదే అదనుగా భావించిన నిర్వాహకులు అక్రమాలకు పాల్పడుతున్నారు. ఏ సేవలకు ఎంత రుసుం చెల్లించాలో తెలియజేసే బోర్డులు పెట్టాల్సి ఉన్నా, కొందరు నిర్వాహకులు ఏర్పాటు చేయడం లేదు. మరి కొన్ని మీ సేవ కేంద్రాల్లో సిటిజన్ చార్ట్ ఉన్నా.. వాటిని నిర్వాహకులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. మీ సేవ కేంద్రాలకు ధ్రువ పత్రాల కోసం వచ్చే వారి సంఖ్య అధికంగా ఉండటంతో ప్రభుత్వం నిర్ణయించిన రుసుం మాత్రమే చెల్లిస్తామని నిర్వాహకులతో లబ్ధిదారులు చెప్పలేకపోతున్నట్లు వాపోతున్నారు.

బినామీ పేర్లతో నిర్వహణ..

నగరంతో సహా శివారుల్లో పలుచోట్ల మీ సేవ కేంద్రాలను ఒకరి పేరుతో అనుమతి పొంది. మరొకరు నిర్వహిస్తున్నారు. నిబంధనల మేరకు ఎవరి పేరుతో మంజూరు ఉంటుందో వారే కేంద్రాలను కొనసాగించాలి. కానీ పైరవీలు చేసుకొని కేంద్రం మంజూరు చేయించుకున్న వారు ఇతర పనులు చూసుకుంటూ వీటిని ఇతరులకు ఇస్తున్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి వాటి నిర్వహణపై పర్యవేక్షణ పెంచాల్సిన అవసరం ఉంది.

రూ.40 అదనంగా తీసుకున్నారు..

నేను ఇటీవల డిగ్రీ పూర్తి చేశాను. పైచదువుల కోసమని ఆదాయ ధ్రువపత్రం కోసం మీ సేవ కేంద్రంలో దరఖాస్తు చేసుకున్నాను. నా దగ్గర రూ.90 వసూలు చేశారు. రూ.50 అని అడిగితే మేము చేయం వెళ్లమన్నారు. గత్యంతరం లేక ఎక్కువ డబ్బులిచ్చి దరఖాస్తు చేసుకున్నాను.

– వై.ప్రేమ్‌సాగర్, రామంతాపూర్, ఉప్పల్ మండలం

టోల్ ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయండి..

ప్రతి మీ సేవ కేంద్రంలో సిటిజన్ చార్ట్ తప్పనిసరిగా ఉండాలి. అందులో సూచించిన మేరకే నగదు తీసుకోవాలి. అధిక వసూళ్లకు పాల్పడితే 1100 టోల్ ఫ్రీ నంబర్, లేదా స్థానిక తహసీల్దార్, ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయవచ్చు. చర్యలు తీసుకుంటాం. ఎవరి పేరుపై ఉంటే వారే నిర్వహించుకోవాలి.

– భానుప్రకాష్, ఈ-డిస్ట్రిక్ట్ మేనేజర్, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా

కూరగాయల ధరలు

కేపీహెచ్‌బీకాలనీ: కూకట్‌పల్లి రైతుబజార్‌లో కూరగాయల ధరలు కిలో రూపాయల్లో.. టమాట 39, వంకాయ 23, బెండకాయ 55, పచ్చిమిర్చి 60, బజ్జిమిర్చి 65, కాకరకాయ 45, బీరకాయ 75, క్యాబేజి 23, బీన్స్ 115, క్యారెట్ 40, గోబిపువ్వు 23, దొండకాయ 28, చిక్కుడుకాయ 45, గోరుచిక్కుడు 45, బీట్‌రూట్ 21, క్యాప్సికం 65, ఆలుగడ్డ 31, కీరా 23, దోసకాయ 25, సొరకాయ 13, పొట్లకాయ 18, కంద 45, ఉల్లిపొరక 95, ఉల్లిగడ్డ 39, మామిడికాయ 10 నుంచి 15, అరటికాయ 8 నుంచి 10, చామగడ్డ 40, ముల్లంగి 4 నుంచి 5, చిలగడ దుంప 40, గుమ్మడికాయ 25, నిమ్మకాయలు 50 నుంచి 60, మునగకాయలు 5 నుంచి 6, బొప్పాయి 40, పుట్టగొడుగులు 40, ఎండుమిర్చి 220, అల్లం 180, వెల్లుల్లి 240, చింతపండు 120, పండు మిర్చి 80, ఉసిరి 60, వేరుశెనగ నూనె 165, పామాయిల్ నూనె 97లుగా ఉన్నాయి.

ఓయూలో చెగువేరా జయంతి

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో చెగువేరా జయంతిని శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. ఏఐఎస్‌ఎఫ్ ఓయూ కార్యదర్శి నెల్లి సత్య ఆధ్వర్యంలో ఆర్ట్స్ కాలేజీ ఎదుట చెగువేర చిత్రపటానికి ఆయనతో పాటు విద్యార్థులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

శ్రీరామకథ సత్సంగ్

మూసాపేట: మూసాపేట గూడ్స్ షెడ్ రోడ్డులోని సంకట మోచన హనుమాన్ మందిర ఆలయంలో శ్రీరామ కథ, దివ్య దర్బార్‌ను శుక్రవారం నిర్వహించారు. అయోధ్య నుంచి వచ్చిన శ్రీధాం అయోధ్య శ్రీరామ్ లలా సర్కార్ ప్రవచనం చేశారు. ఈ కార్యక్రమం ఈనెల 16వ తేదీ వరకు కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు.



కనుల పండువగా పుష్కర బ్రహ్మోత్సవాలు





మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ పరిధి వివేకానందనగర్‌లోని భూనీల సమేత శ్రీవేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో పుష్కర బ్రహ్మోత్సవాలు కనుల పండువగా జరుగుతున్నాయి. కల్యాణ పూర్వాంగం, స్వామి, అమ్మవారికి విశేష మంగళ స్నానాలు న్విహించారు. శనివారం ఉదయం 9గంటలకు స్వామివారి కల్యాణోత్సవం ఉంటుందని నిర్వాహకులు పేర్కొన్నారు. మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం 7గంటలకు స్వామివారి ఊరేగింపు ఉంటుందన్నారు.

కొద్ది క్షణాల్లో ఉద్యోగంలో చేరబోతూ..

రాంగ్ రూట్లో వెళ్లి బైక్‌ను ఢీకొని సాఫ్ట్‌వేర్ ఉద్యోగి దుర్మరణం



మనోజ్‌కుమార్ (ఫైల్)

రాయదుర్గం: కొద్ది క్షణాల్లో ఉద్యోగంలో చేరేలోపే విషాదం చోటు చేసుకుంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం శ్రీకాకుళం జిల్లా మారుమూల గ్రామానికి చెందిన వ్యక్తి సాఫ్ట్‌వేర్ ఉద్యోగంలో చేరడానికి బైక్‌పై బయలు దేరి మార్గమధ్యంలో రాంగ్ రూట్‌లో వెళ్ళి మరో బైక్‌ను ఢీకొనడంతో తీవ్ర గాయాల పాలై అక్కడికక్కడే మృతిచెందిన విషాదకరమైన ఘటన శుక్రవారం ఉదయం చోటు చేసుకుంది. గచ్చిబౌలి ఇన్‌స్పెక్టర్ ఆంజనేయులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. శ్రీకాకుళం జిల్లాలోని గునపాలెమ్‌కు చెందిన పురుషోత్తంరాజు, తల్లి నాగమ్మ ఇద్దరు డఫ్ అండ్ డమ్ . స్థానికంగా ప్రభుత్వ కార్యాలయంలో అటెండర్‌గా పనిచేస్తున్నారు. వీరి కుమారుడు బలగ మనోజ్‌కుమార్(23) సాఫ్ట్‌వేర్ ఉద్యోగం రావడంతో కొత్తగూడలోని నీలమ్ మెన్స్ హాస్టల్‌లో నివాసముంటూ సోమవారం ఉదయం ఉద్యోగంలో చేరడానికి బైక్‌పై బయలు దేరాడు. కొత్తగూడ కూడలి వద్ద అజాగ్రత్తగా, అతివేగంగా హెల్మెట్ లేకుండా వచ్చి సిగ్నల్ వద్ద మరో బైక్‌పై వేచి ఉన్న సాయి అనే విద్యార్థిని ఢీకొట్టాడు. మనోజ్‌కుమార్ కింద పడి హెల్మెట్ లేకపోవడంతో తలకు తీవ్రమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు, కాగా గాయాలపాలైన సాయిని అంబులెన్స్‌లో కొండాపూర్‌లోని ఏరియా ఆస్పత్రికి పోలీసులు తరలించి చికిత్స చేయిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఉరేసుకొని యువకుడు ఆత్మహత్య

రాయదుర్గం: ఐపీఎల్ బెట్టింగ్‌కు యువకుడు బలైన ఘటన రాయదుర్గం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ వెంకన్న తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మెదక్ జిల్లా రేగోడ్ మండలం తట్‌పల్లికి చెందిన కంకరి నగేష్(21) ప్రైవేట్ ఉద్యోగి. గురువారం ఖాజాగూడలోని బాలాజీ లగ్జరీ ఓయోలో గది అద్దెకు తీసుకున్నాడు. శుక్రవారం ఉదయం 11 గంటలకు గది ఖాళీ చేయాల్సి ఉన్నా అతను రాకపోవడంతో రిసెప్షన్‌లో ఉండే గోవింద్ తలుపులు తెరిచి చూడగా ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించాడు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఐపీఎల్ క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడి అప్పుల పాలైనట్లు పోలీసులు తెలిపారు.గత మూడు నెలలుగా ఇంటికి డబ్బులు కూడా పంపడం లేదని తెలిసిందని వారు పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

అనుమానాస్పద స్థితిలో బాలిక మృతి



వసంత(ఫైల్)

మియాపూర్: తల్లిదండ్రులు చదువుకోమని మందలించడంతో ఇంటి నుంచి బయటికి వెళ్ళిన బాలిక అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. చెట్ల పొదల్లో శవమై కనిపించిన సంఘటన మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ దుర్గా రామలింగప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. మియాపూర్ నడిగడ్డతండా సమీపంలో చెట్లపొదల్లో దుర్వాసన వస్తుందని బాలిక మృతి చెందిందని గురువారం రాత్రి స్థానికులు సమాచారం అందించారు. పోలీసులు పరిశీలించి దుస్తులను చూసి వసంతగా గుర్తించారు. మహబూబాబాద్ జిల్లా మర్రిపెడ మండల్, లక్ష్మితండాకు చెందిన బాణోత్ నరేష్, శారద దంపతులకు కుమారుడు, కూతురు వసంత(13) ఉన్నారు.గత 20రోజుల క్రితం స్వగ్రామం నుంచి నగరానికి వచ్చి మియాపూర్ నడిగడ్డ తండాలో ఉంటూ జెప్టోలో పనిచేస్తున్నాడు. వసంత 7వ తరగతి చదువుతుంది. ఈనెల 7వ తేదీన తల్లిదండ్రులు చదువుకోమని మందలించారు. పనుల నుంచి వచ్చిన తరువాత ఇంట్లో కనిపించక పోవడంతో చుట్టుపక్కల వెతికినా ఫలితం లేకపోవడంతో మియాపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో గురువారం పోలీసులు వసంతగా గుర్తించి తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఓయూ హెల్త్ సెంటర్‌లో సౌకర్యాలు కల్పించాలి

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్ హెల్త్ సెంటర్‌లో వైద్య సౌకర్యాలు కల్పించాలని ఏబీవీపీ నేత అలివేలి రాజు ఆధ్వర్యంలో రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మీనారాయణ, చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శ్రీనివాస్‌కు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. ప్రతి విద్యార్థికి హెల్త్‌కార్డు, రూ.2 లక్షల మెడికల్ ఇన్సురెన్స్, ఆర్టీసీ ఆసుపత్రితో పాటు ఇతర ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స, నిరంతరం అందుబాటులో డాక్టర్లు ఉండేలా చర్యలు తీసుకోవాలని వినతి పత్రంలో పేర్కొన్నట్లు వారు తెలిపారు.

నాణ్యమైన సేవలు అందించటమే లక్ష్యం



ప్రియోజిమో మార్క్–2ను ప్రారంభిస్తున్న నిర్వాహకులు

కూకట్‌పల్లి: ప్రియోజిమో మార్క్–2 బ్రాండ్‌లకు చెందిన ఆప్రిలియా, వెస్పా, మోటొ గుజీ ద్విచక్రవాహనాల స్పేర్ పార్ట్స్‌ను వినియోగదారులకు అందుబాటులోకి తీసుకొచ్చింది. వినియోగదారులకు తమ సేవలను మరింత చేరువ చేసేందుకు ప్రియోజిమో మార్క్–2 అందుబాటులోకి తెచ్చామని బిజినెస్ ఎగ్జిక్యూటివ్ వైస్‌ప్రెసిడెంట్ అజయ్ రఘువంశీ, కమ్యూనికేషన్ హెడ్ అపూర్వ సైగల్ అన్నారు. నాణ్యమైన, నమ్మకమైన సేవలు అందించటమే తమ లక్ష్యమన్నారు. నగర ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేందుకు నగరంలో మరిన్ని ద్విచక్ర వాహన షోరూంలు ప్రారంభిస్తామని తెలిపారు.

ప్రొ.కృష్ణారెడ్డి స్మారక ఉపన్యాసం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పొలిటికల్ సైన్స్ విభాగం ప్రొఫెసర్ కృష్ణారెడ్డి 8వ వర్ధంతి సందర్భంగా శుక్రవారం స్మారక ఉపన్యాసం జరిగింది. ప్రొ.కృష్ణారెడ్డి శిష్యుడు డాక్టర్ కోట రాజేశ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి విశ్రాంత ప్రొఫెసర్ చెన్నబసవయ్య అధ్యక్షత వహించగా టీజేఎస్ అధ్యక్షుడు ప్రొ.కోదండరామ్ జూమ్ మీటింగ్‌లో లెక్చర్ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ వీసీలు ప్రొ.రవీందర్, ప్రొ.మల్లేశంతో పాటు విద్యార్థులు, అధ్యాపకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

గ్రూప్-2, 3 ఉద్యోగాల సంఖ్య పెంచండి

ఉస్మానియాయూనివర్సిటీ: గ్రూప్–2, 3 ఉద్యోగాల సంఖ్య పెంచాలని తెలంగాణ డెమోక్రటిక్ స్టూడెంట్ ఫోరం (టీడీఎస్ఎఫ్) రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు విజయ్ నాయక్ పేర్కొన్నారు. గ్రూప్–2లో 1500, గ్రూప్–3లో 2500 ఉద్యోగాలు పెంచేలా ప్రభుత్వం పై ఒత్తిడి తీసుకురావాలని కోరుతూ బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు వినతి పత్రం సమర్పించారు. అలాగే గ్రూప్–1 మెయిన్స్‌కు 1:100 ఇచ్చేలా చూడాలని కోరినట్లు పేర్కొన్నారు.

పాత పింఛన్ విధానం అమలు చేయాలి

ఉస్మానియాయూనివర్సిటీ: ఓయూలో 2001 నుంచి 2004 వరకు నియమితులైన ఉద్యోగులకు పాత పింఛన్, 2004 తర్వాత నియమితులైన వారికి కాంట్రిబ్యూటరీ పింఛన్ విధానాన్ని అమలు చేయాలని ఎన్‌జీవోస్ అధ్యక్షుడు బియ్యాని జ్ఞానేశ్వర్ డిమాండ్ చేశారు. ఓయూ నాన్‌టీచింగ్ హోం కార్యాలయంలో శుక్రవారం జరిగిన సమావేశంలో వివిధ అంశాలపై చర్చించారు. యూజీసీ చట్టాల ప్రకారం నాన్‌టీచింగ్ ఉద్యోగులకు పాలన పదవులు ఇవ్వాలని, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులతో పాటు వర్సిటీ ఉద్యోగులకు హెల్త్‌కార్డులు అందజేయాలని, పాలక మండలి సభ్యులుగా అవకాశం కల్పించాలని, రాష్ట్ర ప్రభుత్వ సమీక్షా సమావేశాల్లో ఉద్యోగులకు భాగస్వామ్యం కల్పించాలని కోరారు.

బీ కేటగిరి సీట్లను కౌన్సెలింగ్ ద్వారా భర్తీ చేయండి

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్రంలోని వివిధ ఇంజినీరింగ్ కాలేజీల్లో బి కేటగిరి సీట్లను కౌన్సెలింగ్ ద్వారా భర్తీ చేయాలని తెలంగాణ రిపబ్లికన్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు నక్క యాదీశ్వర్, తెలంగాణ రిపబ్లిక్ స్టూడెంట్స్ యూనియన్ రాష్ట్ర కన్వీనర్, ఓయూ ఇన్‌చార్జి బోయ రమేశ్ డిమాండ్ కోరారు. ఈ మేరకు ఇంజినీరింగ్, ఫార్మసీ కాలేజీల్లో 2024–25 విద్యా సంవత్సరానికి బీఈ, బీటెక్, బీఫార్మసీ, ఫార్మడీ ప్రవేశాలను కౌన్సెలింగ్ ద్వారా చేట్టాలని శుక్రవారం రాష్ట్ర ఉన్నత విద్యమండలి చైర్మన్ ప్రొ.లింబాద్రికి వినతి పత్రం అందించినట్లు తెలిపారు. బి కేటగిరి సీట్ల భర్తీ కాలేజీ యాజమన్యాలకు వదిలేయడం ద్వారా లక్షల ఫీజులు వసులు చేస్తూ తక్కువ ర్యాంక్ వచ్చిన అభ్యర్థులకు సీట్లు అమ్ముకుంటున్నారని ఆరోపించారు. ఈ విషయమై సీఎం రేవంత్‌రెడ్డి చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

డ్రంకన్ డ్రైవ్‌లో 14 మందికి జైలు

సనత్‌నగర్: బేగంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన 15 మందిని నాంపల్లిలోని ఏడో మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ ముందు శుక్రవారం హాజరుపర్చారు. ఇందులో 13 మంది రెండోసారి పట్టుబడ్డారు. వీరికి 4 రోజుల జైలు శిక్షతో పాటు రూ.3,300ల చొప్పున జరిమానా విధిస్తూ న్యాయమూర్తి స్పందన తీర్పు వెలువరించారు. అలాగే మొదటిసారి పట్టుబడ్డ ఒకరికి 2 రోజుల జైలు శిక్షతో పాటు రూ.2,100ల జరిమానా విధించారు. రెండోసారి పట్టుబడ్డ మరొకరికి 6 నెలల పాటు డ్రైవింగ్ లైసెన్స్ సస్పెన్షన్‌తో పాటు రూ.3,300ల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చినట్లు బేగంపేట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ పాపయ్య తెలిపారు.

వివాహిత దారుణ హత్య

హఫీజ్‌పేట్: చందానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ వివాహిత దారుణ హత్యకు గురైంది. కర్ణాటకకు చెందిన అమర్‌సింగ్, విజయలక్ష్మి (40) దంపతులు లింగంపల్లిలోని ఎంఐజీలో నివాసముంటున్నారు. అమర్‌సింగ్, కూలీ పనిచేస్తుండగా, విజయలక్ష్మి అపర్ణ సరోవర్‌లో వంట పని చేస్తోంది. ఇదిలా ఉండగా విజయలక్ష్మి తమ్ముడు సునీల్ ఆటో ఫైనాన్షియర్ భరత్ గౌడ్ అలియాస్ శ్రీనివాస్‌గౌడ్ (42) వద్ద ఫైనాన్స్ తీసుకొని ఆటో కొనుగోలు చేశాడు. ఈ క్రమంలో ఫైనాన్స్ కట్టడం లేదని భరత్ గౌడ్ సోదరులు ఆటో లాక్కొని వెళ్ళారు. ఇటీవల లోక్ అదాలత్‌లో రాజీ చేసుకున్నారు. ఇదిలా ఉండగా శుక్రవారం మధ్యాహ్నం 12.20 గంటలకు అమర్‌సింగ్ ఇంటికి భరత్ గౌడ్ వచ్చాడు. విజయలక్ష్మి డోర్ తీయగా చిన్న కుమారుడు కార్తీక్ చూస్తుండగా భరత్‌గౌడ్ ఆమె గొంతులో కత్తితో రెండుసార్లు పొడిచాడు. దీంతో ఆమె అక్కడికక్కడే మృతిచెందింది. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టమ్ నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. ఇదిలా ఉండగా హత్యకు గల కారణాలు తెలియాల్సి ఉందని పోలీసులు తెలిపారు.